వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఆదిభట్ల, ఫిబ్రవరి 23 : వ్యభిచార గృహంపై పోలీసులు దాడిచేసి నిర్వాహకురాలిని, మరో ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్న ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి నాదర్‌గుల్‌లో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో కొంత కాలంగా ఓ మహిళ వ్యభిచారం గృహాన్ని నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించారు. బాధిత మహిళలను, నిర్వాహకురాలిని, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బాధితురాలిని మహిళా సంరక్షణ కేంద్రానికి తరలించనున్నట్లు చెప్పారు.



వేంకటేశ్వరస్వామి గుట్టపై సత్యనారాయణస్వామి వ్రతాలు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

యాచారం, ఫిబ్రవరి 23 : మండలంలోని తక్కళ్లపల్లిలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం వందలాది మంది భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. యాచారం, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, తమ్మలోనిగూడ, మాల్ గ్రామాల భక్తులు స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

వైభవోపేతంగా లక్ష్మీచెన్నకేశవుడి చిన్న రథోత్సవం



చిన్న రథం వద్ద భక్తులు

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు

కడ్తాల్, ఫిబ్రవరి 23: కడ్తాల్‌లోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. స్థానికులు, సమీప గ్రామాల భక్తులు భారీగా తరలివస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున అగ్ని గుండాలు, పుష్పమాల సేవ(చిన్న రథోత్సవం) కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి భక్తులు తాళ్లతో లాగారు. విష్ణుసహస్రనామ పారాయణం, పుష్పార్చన, తదితర పూజలు నిర్వహించారు. సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ స్వామి వారిని దర్శించుకున్నారు. వారిని ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి సత్కరించారు. పూజా కార్యక్రమాలు, కార్యక్రమాల ఏర్పాట్లలో ఉత్సవ/ ఆలయ కమిటీల చైర్మన్లు వేణుగోపాల్, పాలాది ఆంజనయులు, ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్, అర్చకులు శ్రీధర్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్వరశర్మ, వేణుగోపాల్, నర్సింహమూర్తి, నాయకులు నరేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, వెంకటరెడ్డి, మల్లేశ్‌గౌడ్, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ



పార్టీ చేపట్టే కార్యక్రమాలనైనా, ప్రభుత్వ పథకాలనైనా చేవెళ్ల గడ్డ నుంచి ప్రారంభిస్తే బాగుంటుందనే ఆనవాయితీని కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం మరోసారి కొనసాగించనుంది. ఆరు గ్యారంటీ పథకాల అమల్లో భాగంగా రెండింటిని ఇక్కడి నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలంచారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పథకాలను ఈ నెల 27న చేవెళ్ల నుంచి అమలు చేయనున్నారు. ఇందుకు బహిరంగ సభ ఏర్పాట్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నిమగ్నమయ్యారు. తొలుత 2004లో చేవెళ్ల నుంచి అప్పటి ప్రతిపక్షనేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజాప్రస్థానం పాదయాత్ర ప్రారంభించారు. అదే సంవత్సరంలో ఎన్నికల శంఖారావాన్నీ అక్కడి నుంచే పూరించి విజయం సాధించారు. అప్పటి నుంచి చేవెళ్ల నుంచి ఏదో ఒక ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రారంభించడం కాంగ్రెస్ ముఖ్యమంత్రులకు సెంటిమెంటుగా మారింది!

చేవెళ్ల గ్యారంటీలు

సెంటిమెంట్‌ను కొనసాగించనున్న కాంగ్రెస్

- చేవెళ్ల గడ్డ నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాల అమలు
- భారీ బహిరంగసభకు ప్రభుత్వం సన్నాహాలు
- ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ
- భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు ముమ్మరం

ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ మరోసారి చేవెళ్ల సెంటిమెంట్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. అన్ని విధాలా అచ్చొచ్చిన ఈ ప్రాంతం నుంచే మరో మారు కీలక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. గతంలో కాంగ్రెస్ సీఎంలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి చేవెళ్ల నుంచే ఎన్నో కార్యక్రమాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పథకాలే కాకుండా ఎన్నికల ప్రచార కార్యక్రమాలను కూడా ఇక్కడ నుంచే మొదలుపెట్టారు. కాంగ్రెస్ పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత రేవంత్‌రెడ్డి కూడా ఇదే ఆనవాయితీని కొనసాగించడం గమనార్హం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండింటిని ఈ నెల 27న చేవెళ్లలో ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని సైతం ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు భారీగా జనసమీకరణకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చర్యలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీకి అచ్చొచ్చిన చేవెళ్లలో ప్రభుత్వ పరంగా మరో ముఖ్య కార్యక్రమం జరగనుండడంతో పార్టీ శ్రేణుల్లోనూ ఆనందం వెల్లివిరిస్తోంది. తొలుత చేవెళ్ల నుంచి 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజా ప్రస్థానం పేరిట పాదయాత్రను ప్రారంభించి కాంగ్రెస్‌లో నూతనోత్తేజం తెచ్చారు. అనంతరం ఎన్నికల ప్రచారానికీ చేవెళ్ల నుంచే శంఖారావాన్ని పూరించి కాంగ్రెస్ పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఇక అప్పటి నుంచి చేవెళ్ల గడ్డ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా వైఎస్సార్ చేవెళ్ల నుంచే ప్రారంభించేవారు. ప్రతిష్ఠాత్మక గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చేవెళ్ల మండలం ఆలూరు నుంచే నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ సైతం హాజరయ్యారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఉన్న రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం కొన్ని కార్యక్రమాలను చేవెళ్ల నుంచే ప్రారంభించారు.



గత ముఖ్యమంత్రుల బాటలోనే ప్రస్తుత సీఎం

కాంగ్రెస్ గత ముఖ్యమంత్రులు చూపిన ఇదే బాటలోనే రేవంత్‌రెడ్డి కూడా నడుస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఎస్సీ డిక్లరేషన్‌ను చేవెళ్లలోనే ప్రకటించింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చేవెళ్లతో కాంగ్రెస్‌కు ఉన్న బలమైన బంధాన్ని మరోసారి కొనసాగించాలని నిర్ణయించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి ఆర్టీసీలో బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఈ పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోంది. మహిళల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. అలాగే రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద రూ.10లక్షల ఖర్చు వరకు వైద్యం చేయించుకునే పథకాన్ని అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మరో రెండు పథకాలు ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. గ్యారంటీల్లోని 'మహాలక్ష్మి' పథకం కింద వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే ఇవ్వనున్నారు. అలాగే 'గృహజ్యోతి'లో భాగంగా ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. ఈ రెండు పథకాల అమలుకు చేవెళ్ల నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ముఖ్య అతిథిగా, మరి మరి కొందరు జాతీయస్థాయి నేతలు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగ సభను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం కలెక్టర్ శశాంక, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్, వివిధ శాఖల అధికారులు సభాస్థలం, హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులతో బహిరంగ సభ స్థలం ఏర్పాట్లపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సభకు ఎన్నో రోజులు లేనందున ఏర్పాట్లను వేగిరం చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్‌రావు, డీఆర్డీవో పీడీ శ్రీలత, ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్, సీఐ లక్ష్మారెడ్డి, ట్రాన్స్‌కో ఏడీఈ స్వామి, ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభను విజయవంతం చేయాలి : ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమల్లో భాగంగా ఈ నెల 27న చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం నేత భీం భరత్, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి అన్నారు. శుక్రవారం వారు చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా గృహజ్యోతి(200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాల ప్రారంభోత్సవాన్ని చేవెళ్లలో నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. బహిరంగ సభ 27న సాయంత్రం చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఉంటుందన్నారు. సభకు భారీ సంఖ్యలో మహిళలు, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర పీఆర్ చాంబర్స్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, ప్యాక్స్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, బండారు శైలజాఆగిరెడ్డి, మాణిక్యరెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, నర్సింలు, ప్రభాకర్, పాండుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నా పోరాటం వల్లే పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్

- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తుండదు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 23 : తన పోరాటం వల్లే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారని, పాలమూరు ప్రజల నీటి అవసరాలకు తాను రాయలసీమ ప్రాంత ప్రజలతో పోరాటం చేశానని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. షాద్‌నగర్‌లోని ఏబీ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ సాధనకు నిరసనలు, నిరాహార దీక్షలు, ధర్నాలు చేసినట్లు ఆమె గుర్తుచేశారు. చిల్లర రాజకీయాలు మాని పాలమూరు అభివృద్ధికి ప్రస్తుత పాలకులు కృషిచేయాలని హితవు పలికారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే రావాలన్నారు. పాలమూరులోని రెండు సీట్లూ బీజేపీనే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణాలో బీజేపీ ప్రభుత్వం లేకున్నా రాష్ట్రానికి కేంద్రం పదేళ్లలో రూ.10లక్షల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. ఏళ్ల తరబడి దేశంలో పరిష్కారం కాని సమస్యలను మోదీ పరిష్కరించారని తెలిపారు. ప్రపంచంలో భారత్ ఆదర్శవంతంగా ముందుకుపోతోందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నపుడు బీఆర్ఎస్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా అంటూ వచ్చిందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వస్తోందన్నారు. అంతకు ముందు మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ పూర్తిచేసేది బీజేపీ మాత్రమేనన్నారు. నదుల అనుసంధానంతో తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్‌ను పట్టించుకోలేదన్నారు. సమావేశంలో నాయకులు నాగురావు నామాజీ, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, అశోక్‌గౌడ్, వెంకటేష్‌గుప్తా, రుషికేష్, భూషన్, మురళి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ ఐఐటీ అకాడమీలో నిర్వహించిన జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్‌లో మాట్లాడుతున్న డీజీపీ రవిగుప్తా

పోలీసు దర్యాప్తులో జాగిలాల పాత్ర కీలకం

- రాష్ట్ర డీజీపీ రవిగుప్తా
- ఐఐటీఏలో 23వ బ్యాచ్ జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 : పోలీసు శాఖలో నమోదయ్యే వివిధ కేసుల దర్యాప్తుల్లో జాగిలాల పాత్ర కీలకం అని, అవి తెలియజేసే ఆధారాల ద్వారా నిందితులను గుర్తించి కేసులను ఛేదించడం సులభతరమైందని తెలంగాణ డీజీపీ రవిగుప్తా అన్నారు. మొయినాబాద్‌లోని ఐఐటీఏ జాగిలాల ట్రైనింగ్ సెంటర్‌లో 9 నెలల పాటు శిక్షణ పొందిన 21(23వ బ్యాచ్) జాగిలాల పాసింగ్ ఔట్ పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాగిలాల ట్రైనర్లకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ మొయినాబాద్ ఐఐటీఏలో శిక్షణపొందిన జాగిలాలు ఇతర రాష్ట్రాల్లోనూ పనిచేస్తున్నాయన్నారు. ఆయా రాష్ట్రాల పోలీసు శాఖలు ఈ కేంద్రంపై ప్రత్యేక దృష్టిపెట్టాయన్నారు. మొయినాబాద్ ఐఐటీఏ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని తెలిపారు. నిత్యం ఏదో ఒకచోట యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల సరఫరా ఛేదన, చోరీలు, అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు, సైబర్ క్రైమ్‌లను అరికట్టడంలో జాగిలాలు పోలీసులకు సహకరిస్తున్నాయని అన్నారు. తెలంగాణ పోలీసు శాఖ పనితీరును ప్రధానమంత్రి నరేంద్రమోదీ తరచూ అభినందిస్తుంటారని చెప్పారు. ఎలాంటి కేసులనైనా ఛేదించేలా రాష్ట్ర పోలీస్ వ్యవస్థ పనిచేస్తోందని, అందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని అన్నారు. ఏడాది కాలంలో ఈ శిక్షణ కేంద్రంలో 21 జాగిలాలు శిక్షణ పొందాయన్నారు. జాగిలాల విన్యాసాలను డీజీపీ, ఆహూతులు తిలకించి అభినందించారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ శివధర్‌రెడ్డి, డీఐజీ టఫ్‌సీర్, సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్‌శాండిల్య, మొయినాబాద్ ఐఐటీఏ(ఐసీ ప్రిన్సిపాల్) అరవింద్‌రావు, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

60 ఏళ్లలో కాని అభివృద్ధి

పదేళ్లలో చేశాం

అవినీతి లేని పాలన అందించిన మోదీని మరోసారి ఆశీర్వదించండి

విజయ సంకల్ప యాత్ర సభలో బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల/మంచాల/యాచారం, ఫిబ్రవరి 23 : గతంలో 60ఏళ్ల కాంగ్రెస్ పాలన అవినీతి, బంధుప్రీతితో దేశం వెనకబడిందని, 60ఏళ్లలో జరగని అభివృద్ధిని మోదీ నేతృత్వంలో పదేళ్ల పాలనలో చేశామని బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు అన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర శుక్రవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం చేరుకుంది. ఇందులో భాగంగా భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధి బహిరంగ సభను ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ కన్వీనర్ యాదగిరిరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో కామారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్‌రెడ్డిలతో మురళీధర్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పాలన అవినీతి మయం అని, ఢిల్లీ నుంచి రూపాయి పంపితే 15పైసలు మాత్రమే ప్రజలకు చేరేవని అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ అనేవారని గుర్తుచేశారు. పేదల కష్టాలు తెలిసిన నరేంద్రమోదీ పాలన వచ్చిన తరువాత అన్ని వర్గాలకు పనిచేశారన్నారు. బ్యాంకు మెట్లు ఎక్కని ప్రజలకు ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా బ్యాంకు ఖాతాలను తెరిపించారని అన్నారు. దీంతో ప్రభుత్వం అందించే ప్రతీ పైసా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో పడుతోందని, ఇదీ నరేంద్రమోదీ పారదర్శక పాలన అన్నారు. గ్రామీణ మహిళలకు 13కోట్ల మరుగుదొడ్ల నిర్మించడం, కోట్లాది మంది యువతకు ముద్ర రుణాలు అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషిచేసిందన్నారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపుతానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వొచ్చి రెండు నెలలవుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ నినాదంతో పాలన అందిస్తున్న నరేంద్రమోదీని మనం మరోసారి ప్రధానమంత్రిగా చేసుకుందాం అన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ హయాంలో దేశ ప్రతిష్ఠ ఎంతో పెరిగిందని, భారత్‌ను విశ్వగురువుగా మార్చే సత్తా మోదీకే ఉందన్నారు. గతంలోని బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ఉచిత హామీలతో ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ నేడు దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు కాంగ్రెస్ పార్టీనే కారణం అన్నారు. దేశం బాగుండాలంటే దేశంలో కాంగ్రెస్ లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, యాత్ర ప్రముఖ్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, లచ్చిరెడ్డి, ప్రతాప్, బాషా, పాపారావు, అంజయ్య, వీరేందర్‌గౌడ్, అర్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణయాదవ్, రాములు, భాస్కర్, సత్యనారాయణ, రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేష్, శ్రీశైలం, దన్నె బాషయ్య, పాండాల జంగయ్య, వెంకట్‌రెడ్డి, పాండు, బండి రాజు, నూకం రాజు, రాజేందర్‌రెడ్డి, బిక్షపతి, గోవర్ధన్‌చారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిది అప్పుడో మాట.. ఇప్పుడో మాట

ఫార్మాసిటీపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలో లేనప్పుడు ఓ మాట, పదవిలోకి రాగానే మరోమాట మాట్లాడుతున్నారని, కంపెనీలతో ఆయనకు ఏమైనా సెటిల్మెంట్ జరిగిందో అర్థం కావడం లేదని బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డిని వారు సెటిల్‌మెంట్ సీఎం అని విమర్శించారు. యాచారం మండలం మాల్, యాచారం, మంచాల మండలం ఆగాపల్లిల్లో రోడ్డు షోలు, కార్నర్ మీటింగుల్లో మాట్లాడారు. విషతుల్య ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఎన్నికల్లో చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట మార్చుతున్నారన్నారు. ఫార్మా కంపెనీలు పెట్టేవారితో ఆయనకేమైనా సెటిల్‌మెంట్ జరిగిందో మోననే అనుమానం కలుగుతోందన్నారు. ఫార్మాసిటీని రద్దు చేసి సీఎం తన నిజాయితీని చాటుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, శ్మశాన వాటికలు, సీసీ రోడ్లు, తాగునీటి పనులను కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేశారన్నారు. కానీ తామే చేసినట్టు చెప్పుకున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలు కేంద్ర నిధులతో సోకులు పడ్డారని మండిపడ్డారు. అలవిగాని హామీలిచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు బడ్జెట్ లేదని తలపట్టుకుంటోందని విమర్శించారు. మచ్చలేని నేతగా దేశ ప్రజలకు సేవలందిస్తున్న నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రి అవడం ఖాయమన్నారు. యాచారంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ఇతర నాయకులు అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాంల విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సుకన్య, బీజేపీ మండలాల అధ్యక్షులు రవీందర్, ఎన్.కృష్ణ, ఆర్.విజయ్‌కుమార్, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం రోడ్ షోలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

● **కడ్తాల్ :** కడ్తాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్వపరి పాలనలో భాగంగా విద్యార్థులు చక్కటి వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించిన తీరు చూపరులకు ముచ్చట గొలిపింది.

విద్యార్థినులు ఆకర్షణకు లోనుకావొద్దు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 23: విద్యార్థినులు కొన్ని విషయాల పట్ల ఆకర్షణకు లోనుకావొద్దని టీషీమ్ సభ్యులు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాల విద్యార్థినులకు గురువారం ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. అమ్మాయిలకు ఎటువంటి సమస్య వచ్చినా 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏదైనా ఆపద వచ్చినప్పుడు గాబరా పడకుండా తెలివిగా ప్రవర్తించాలని తెలిపారు. వసతి గృహాల నుంచి బయటికి వెళ్లిన తర్వాత సరైన జీవిత మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పిచ్చయ్య, గోపాల్, ప్రమోద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యుడు

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మాడ్గుల, ఫిబ్రవరి 23 : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ గౌరవరం పద్మ అన్నారు. మండలంలోని అందుగుల గ్రామంలో అండర్‌డ్రైనేజీ పనులకు శుక్రవారం ఆమె భూమి పూజ చేశారు. పీఏసీఎస్ జగన్‌గౌడ్ ఎంపీపీని సంప్రదించి గ్రామ సమస్యలను వివరించడంతో వెంటనే స్పందించి మండల పరిషత్ నిధులు రూ.2లక్షల మంజూరు చేయించారు. సర్పంచ్ విజయలక్ష్మి రాజు, రమేష్, పెంటయ్య, వెంకటయ్య, ఇస్మాయిల్, జంగయ్యలు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ పద్మ

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

కొందుర్గు, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని పర్వతాపూర్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులను శుక్రవారం ఎంపీటీసీ సభ్యురాలు బి.మంజుల మల్లేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.5లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కిలోమీటర్ దూరంలో ఉన్న మంగళి చెరువు నుంచి గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వరకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య గురించి చెప్పిన వెంటనే స్పందించి నిధులను మంజూరు చేయించి, తాగునీటి సమస్యను తీర్చుతున్న ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.




తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు



తల్లుల దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు



తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూలైన్లలో జనం



తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం



భక్త జన హోరు..



▸▸ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▸▸ నిరంతరాయంగా దర్శనాలు ▸▸ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్

మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపిచింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.



నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులం దిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

హరితహారం లక్ష్యాలను అధిగమించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 23 : హరితహారం లక్ష్యాలను అధిగమించేలా అధికారులు పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణకు హరితహారం కార్యాచరణ ప్రణాళికపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో గత సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు శాఖల వారీగా సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఔషధ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్లకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ కోసం మొక్కలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఖాళీ స్థలాన్ని గుర్తించి పంచాయతీలకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పొలాలగట్లపై కూడా మొక్కలు నాటాలని ఆయన సూచించారు. సమావేశంలో డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ డీఆర్డీవో ఎ.శ్రీనివాస్, పరిశ్రమశాఖ అధికారి వినయ్ కుమార్, పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, జిల్లా గనుల శాఖ అధికారి సామెల్‌జాకబ్, ఉద్యానవన శాఖ అధికారి అర్చన, మున్సిపల్ కమిషనర్లు మహమ్మద్ జాకీర్ అహ్మద్, వెంకటయ్య, బలరాంనాయక్, విక్రమ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

● ఎంపీపీ మంద జ్యోతి



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ జ్యోతి

కందుకూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని లేమూరులో నిషితా ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రిన్సిపాల్, క్యాంటీన్ కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మంద జ్యోతి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా ప్రిన్సిపాల్ నాగభూషణచారి అందుబాటులో లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పాఠశాలలో 1060మంది విద్యార్థులు చదువుతున్నారని, వారిలో యాభై శాతం మంది తామర, అలర్జీతో బాధపడుతున్నా కనీసం వైద్య పరీక్షలు చేయించలేదని ఆరోపించారు. పాఠశాలలో డైనింగ్ టేబుల్స్‌ను వారానికి ఒక్కసారి కూడా శుభ్రం చేయడం లేదని విద్యార్థులు గోడు వెల్లబోసుకున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్, కాంట్రాక్టర్ కుమ్మక్కై విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై ఇన్‌చార్జి టీచర్‌ను ప్రశ్నించగా ఆమె పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు ఎంపీపీ చెప్పారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై వారి తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకే ఆకస్మిక తనిఖీ చేశామన్నారు. పాఠశాలలోని సమస్యలపై ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ తెలిపారు. విద్యార్థులకు వెంటనే ప్రత్యేకంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు.

28 నుంచి ఇంటర్ పరీక్షలు

● వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

వికారాబాద్, ఫిబ్రవరి 23 : ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 28, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 29 నుంచి ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వార్షిక పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ అన్నారు. శుక్రవారం నోడల్ అధికారి కార్యాలయంలో ఇంటర్ పబ్లిక్ థియరీ పరీక్షల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో జనరల్ 6,447, ఒకేషనల్ 1,352, ద్వితీయ సంవత్సరం జనరల్ 7689, ఒకేషనల్ 1,335 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, స్క్వాడ్ మెంబర్స్, కస్టోడియన్స్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్స్ ఇంటర్ థియరీ పరీక్షలను ఇంటర్ బోర్డు నియమ, నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. పరీక్షల నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రాజమోహన్, బుచ్చయ్య, వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ మెంబర్లు, కస్టోడియన్స్ పాల్గొన్నారు.

ఎంపీడీవోలకు ఘనసన్మానం

నందిగామ/మంచాల, ఫిబ్రవరి 23 : నందిగామ, మంచాల ఎంపీడీవోలుగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌ను శుక్రవారం ఆయా మండలాల్లో ఎంపీపీలు ప్రియాంక శివశంకర్‌గౌడ్, జాటోత్ నర్మదలచ్చిరాం ఘనంగా సన్మానించారు. మండలాల అభివృద్ధికి ఎంపీడీవోలు కృషి చేశారని వారు కొనియాడారు. జడ్పీవైస్‌చైర్మన్ ఈట గణేష్, మంచాల ఎమ్మార్వో ప్రసాద్‌రావు, వైస్‌ఎంపీపీ రాజేశ్వరి, సూపరింటెంట్ జంగయ్య ఎంపీటీసీలు చీరాల రమేష్, ఎల్.చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, కొమ్ముక్రిష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు పాండురంగారెడ్డి, జేకే నర్సింలు, అధికారులు ఉన్నారు.

ఆదాయ వ్యయాలు పక్కాగా ఉండాలి

● గ్రామసభ ద్వారా పనులు గుర్తించాలి

● పంచాయతీరాజ్ శాఖ

ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ

తాండూరు, ఫిబ్రవరి 23 : గ్రామ పంచాయతీల ఆదాయం, వ్యయాల లెక్కలు పక్కాగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రెండు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించి ఆ వివరాలను ప్రజల ముందు ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పంచాయతీకి వచ్చే ప్రతి రూపాయిని ట్రెజరీలో అదే రోజు జమా చేయాలని, చెక్కుల ద్వారా ట్రెజరీ నుంచే ఖర్చులకు చెల్లింపులు చేయాలని సూచించారు. నేరుగా చెల్లించొద్దని స్పష్టం చేశారు. వాటికి పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి బాధ్యులని, వారి జాయింట్ సంతకంతోనే నిధులు డ్రా చేయాలని తెలిపారు. ఖర్చు, ఆదాయ వివరాలు, క్యాష్ బుక్కు నందు అప్‌డేట్ చేయాలని, ప్రతి బిల్లుకు సంబంధించి ఎంబీ రికార్డు, ఓచర్స్, బిల్లులు తప్పని సరిగా ఉండాలని చెప్పారు. ఎలక్ట్రికల్ మెటీరియల్, పబ్లిక్ హెల్త్ మెటీరియల్‌ను డీసీపీ ఆమోదించిన రేట్ల మేరకు టెండర్ రూల్స్‌ను అనుసరించి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు.

సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలు

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలి. వీధి దీపాలు 90 శాతం ఉండేలా, కాలిపోయిన వాటి స్థానంలో వెంటనే కొత్తవి అమర్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి ఇంటికి నీటి సరఫరా జరగాలి. ఎప్పటికప్పుడు సప్లైని ప్రత్యేకాధికారి పర్యవేక్షిస్తూ మరమ్మత్తులు వెంటనే జరిగేలా చూడాలి. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి. వారంలో ఒకరోజు డ్రైడే పాటించేలా చూడాలి. నర్సరీకి నీళ్లు అందుతున్నాయా లేదా పర్యవేక్షిస్తూ మొక్కలు చనిపోకుండా చూడాలి.

అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే

గృహనిర్మాణ అనుమతులను మాన్యువల్‌గా ఇవ్వొద్దని, టీఎస్‌బీపాస్ ద్వారానే ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు కూడ ఆన్‌లైన్‌లో ఇవ్వాలని, ఫీజులన్నింటిని ఆన్‌లైన్‌లో కట్టించుకోవాలని సూచించారు.



గ్రామ పంచాయతీ భవనం

అభివృద్ధి పనులకు యాక్షన్‌ప్లాన్

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని, బిల్లులు చెల్లించే ముందు ఆ పనులను పరిశీలించాలని పంచాయతీరాజ్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గ్రామసభ ద్వారా గుర్తించిన పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

పంచాయతీ స్థలాల పరిరక్షణకు చర్యలు

ఖాళీ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీకి సంబంధించిన ఖాళీ స్థలాలు, స్థిరాస్తుల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఆదేశాలు వచ్చాయి.

పోస్టింగ్ ఒకచోట.. విధులు మరోచోట

● డీఎఫ్‌వో కార్యాలయంలో

విధులు నిర్వహిస్తున్న బీట్ అధికారి

ధారూరు, ఫిబ్రవరి 23 : పోస్టింగ్ ఓ చోట ఉండగా విధులు మరోచోట నిర్వహిస్తున్నారు ఓ అటవీశాఖ బీట్ అధికారి. వివరాలిలా ఉన్నాయి. ధారూరు అటవీరేంజ్ పరిధిలోని రాస్నం సెక్షన్, దోర్నాల్ బీట్ అధికారి సిరాజుద్దీన్ ఇక్కడ విధులు నిర్వహించటంలేదు. విధుల్లో చేరిన తర్వాత నెల రోజులు మాత్రమే దోర్నాల్ బీట్‌లో ఆయన పనిచేశారు. అనంతరం రెండేళ్లుగా డీఎఫ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడ పని చేయటం లేదని ఆరోపణలున్నాయి. సిరాజుద్దీన్ స్థానంలో మరో బీట్ అధికారి అనంద్‌కు సంబంధిత అధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అన్ని శాఖలలో ప్రభుత్వం డిప్యూటేషన్లను రద్దు చేస్తుండగా, ఈ శాఖలో కొనసాగటం గమనార్హం. కాగా పూర్తిస్థాయి బీట్ అధికారి లేకపోవటంతో దోర్నాల్ అటవీ ప్రాంతం నాశనమవుతోంది. పలువురు చెట్లను నరికి అడవిని ఆక్రమించుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటవీ రేంజ్‌లో బీట్ అధికారుల కొరత ఉండగా ఉన్న బీట్ అధికారిని డీఎఫ్‌వో కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధుల్లోకి తీసుకోవటం విమర్శలకు తావిస్తోంది. కాగా బీట్ ఆఫీసర్‌గా ఉన్న సిరాజుద్దీన్ డీఎఫ్‌వో కార్యాలయంలో గెజిటెడ్ అధికారి స్థాయి విధులు నిర్వహించటంపై ఆ శాఖ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించవలసిన వ్యక్తి గెజిటెడ్ అధికారి సీట్లో కూర్చొని చక్రం తిప్పుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పలువురు అధికారులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి సిరాజుద్దీన్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం

● ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ

ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి



ప్రసాద్‌ను సన్మానిస్తున్న మల్లు రవి

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ భూస్థాపితం తప్పదని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకొని, కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఎంగళి ప్రసాద్‌ను ఆయన సత్కరించారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య మల్లు రవిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందన్నారు. మండ్లీ రాములు, రవీందర్‌నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఖాదర్‌ఖాద్రీ, రాఘవేందర్, నారాయణ, జంతుక యాదయ్య, కుమార్‌గౌడ్, రాజశేఖర్, గోల్డ్ రాము, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పాపం.. పసిపాప

● కరువైన అమ్మ ఆలన, నాన్న లాలన ● శిశువిహార్‌కు తరలింపు



చిన్నారిని శిశువిహార్‌కు తరలిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23) : కొడుకు మీద ఆశ, డబ్బు మీద అత్యాశ తో ఓ జంట తమకు నాలుగో సంతానంగా పుట్టిన బిడ్డను వదిలించుకోవాలనుకుంది. రూ.25 వేలు, తులం బంగారానికి ఆ చిన్నారిని అమ్ముకోవాలని ప్రయత్నించగా.. విషయం తెలుసుకున్న శిశు సంక్షేమ శాఖాధికారులు వారికి కౌన్సిలింగ్ చేశారు. సీడీపీవో శోభారాణి, సూపర్ వైజర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్ స్వప్న కలిసి శుక్రవారం చేవెళ్ల మండలం బస్తేపూర్ గ్రామంలోని పిచ్చకుంట్ల మల్లేష్ సుజాత ఇంటికి చేరుకున్నారు. తల్లిపాలకు నోచుకోని చిన్నారికి డబ్బా పాలు పట్టించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. తల్లిదండ్రులకు భారంగా మారిన ఆ పాపను ఐసీపీఎస్ ప్రొటెక్షన్ అధికారి దేవేందర్‌చారికి అప్పగించారు. అనంతరం చిన్నారిని శిశువిహార్‌కు తరలించారు.

28న మహేశ్వరం ఎంపీపీ ఎన్నిక

● హాజరుకావాలని ఎంపీటీసీలకు నోటీసులు

● గోవాలో బీఆర్ఎస్ సభ్యుల క్యాంపు

మహేశ్వరం, ఫిబ్రవరి 23 : మహేశ్వరం ఎంపీపీ ఎన్నికకు ప్రణాళిక సిద్ధమవుతోంది. ఈ నెల 28న ఎన్నిక ఉంటుందని దీనికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు హాజరుకావాలని ఎన్నికల అధికారి గురువారం, శుక్రవారం నోటీసులు జారీచేశారు. ఎంపీపీగా కొనసాగిన మన్‌సాన్‌పల్లికి చెందిన కె.రఘుమారెడ్డి అనివార్యకారణాల వల్ల తన ఎంపీటీసీ సభ్యత్వంతో పాటు ఎంపీపీ పదవికి సెప్టెంబర్ 13న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు వైస్‌ఎంపీపీ ఆర్. సునితఅంద్యానాయక్‌ను ఇన్‌చార్జి ఎంపీపీగా నియమించారు. మండలంలో మొత్తం 13 ఎంపీటీసీలు ఉండగా రఘుమారెడ్డి రాజీనామాతో మిగిలిన 12 మంది ఈ ఎన్నికకు హాజరుకావాల్సి ఉంది. బీఆర్ఎస్‌కు 7, బీజేపీకి 5గురు సభ్యులున్నారు. కాగా బీఆర్ఎస్‌కు చెందిన 5గురు ఎంపీటీసీలు గోవాలో క్యాంపు రాజకీయాలకు తెరలేపారు.



దీపాదాస్ మున్షీని కలిసిన

యాచారం మండల కాంగ్రెస్ నాయకులు

యాచారం, ఫిబ్రవరి 23 : కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని శుక్రవారం యాచారం మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈమేరకు ఎం.నర్సింహ, వి.తిరుమలేష్, అక్బర్ తదితరులు ఆమెను నగరంలో కలిసి మండలంలో పార్టీ పరిస్థితిని వివరించారు. పార్టీ క్యాడర్ మరింత ఉత్సాహంతో పని చేసి ఎంపీ ఎన్నికల్లో విపక్షాలకు గుణపాఠం చెప్పేలా ముందుకుసాగాలని దీపాదాస్ సూచించినట్లు నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని, ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించినట్లు నాయకులు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



ఎల్వోసీని అందజేస్తున్న బాలాజీసింగ్

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 : ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పీసీసీ అధికార ప్రతినిధి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామానికి చెందిన కాసోజు తన్విశ్రీ గుండె వైద్య చికిత్సకు ఎమ్మెల్యే కల్వకుర్తి కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.2.50లక్షలు మంజూరు చేయించారు. ఈమేరకు ఎల్వోసీని శుక్రవారం తన్విశ్రీ తండ్రి ప్రమోద్ కు బాలాజీసింగ్‌కు ఆమనగల్లులో అందించారు. ప్రజాపాలనలో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని బాలాజీ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని అన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నితిన్‌రెడ్డి, తిరుమలేష్, ప్రశాంత్, శ్రీను, మధు, నాగరాజు తదితరులున్నారు.

కర్మయోగి.. సంత్ గాడ్గే బాబా

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 23: స్వచ్ఛత ప్రవక్త, అంటరాని తనం నిర్మూలనకు, మూఢనమ్మకాలను పారద్రోలేందుకు కృషి చేసిన సంత్ గాడ్గే బాబా కర్మయోగి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు ఆధ్వర్యంలో గాడ్గే బాబా 148వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాబా తన జీవితాంతం సమాజహితం కోసం పాటుపడ్డారని ఎమ్మెల్యే తెలిపారు. జంతు బలి ఇచ్చే ఆచారాన్ని సమాజం నుంచి తరిమేసేందుకు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ నాయకులు దొంతుల సురేష్ కుమార్, శ్రీనివాస సాగర్, అందె మోహన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

కేశంపేట : అనారోగ్యంతో మృతిచెందిన సురమోని కిష్టమ్మ కుటుంబానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడకు చెందిన కిష్టమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రూ. 10వేలు సమకూర్చగా కార్యకర్తలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు యాదయ్య, శివానంద్, బాల్‌రాజ్, నాగరాజు, నర్సింలు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ రూరల్ : గాడ్గే బాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



భీంభరత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు, తదితరులు

చేవెళ్ల, ఫిబ్రవరి 23 : కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల మండల పరిధిలోని కుమ్మెర గ్రామం మాజీ సర్పంచ్ పాండుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ శంకర్‌లు బీఆర్ఎస్, బీజేపీల నుంచి 200 మంది కార్యకర్తలు భీంభారత్ సమక్షంలో అజీజ్‌నగర్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడం సంతోషకరమన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్, మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

షాబాద్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని, చేవెళ్ల నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతిభీంభరత్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేసారం, బోడంపహాడ్, కక్కులూర్, కుర్వగూడ గ్రామాల్లో మహిళా కమిటీలు వేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఇందిరమ్మ స్ఫూర్తితో, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ దీవెనలతో, యువ మహిళానేత ప్రియంక నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఏర్పడబోయే కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో మహిళల మద్దతు ఎంతో అవసరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంలాంటిందని, తొందరలోనే రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు ప్రారంభిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో బ్లాక్‌ఏ అధ్యక్షురాలు పీసరి అనితాసురేందర్‌రెడ్డి, పార్టీ మహిళా మండలాధ్యక్షురాలు అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శంషాబాద్, ఫిబ్రవరి 23 : మున్సిపల్ కేంద్రంలోని ఇందిర ఆసుపత్రి సమీపంలో రోడ్డుపక్కన ఉన్న బ్రిడ్జి కింద ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించారు. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

● బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం.. వ్యక్తి దుర్మరణం

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 23 : గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫత్తేపూర్ బ్రిడ్జి వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎర్వగూడ గ్రామానికి చెందిన కుసుమగళ్ల వెంకటేశ్(31) బైక్‌పై ఈనెల 22న మనసాన్‌పల్లిలోని బంధువుల ఇంట్లో డిన్నర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో ఫత్తేపూర్ బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దాంతో వెంకటేశ్ తలకు బలమైన రక్తగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు చెప్పారు.

● ఆగి ఉన్న లారీని ఢీకొని మరొకరు..

యాచారం, ఫిబ్రవరి 23 : ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. శుక్రవారం రాత్రి మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పట్నం శ్రీశైలం(50) ఇబ్రహీంపట్నంలో ఎఫ్‌సీఐ గోదాంలో విధులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. చౌదర్‌పల్లి గేటు సమీపంలో ఆగి ఉన్న లారీని వెనకవైపు బైక్‌తో ఢీకొన్నాడు. దాంతో అతడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ చెప్పారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

ఆదిభట్ల, ఫిబ్రవరి 23 : కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలం రావిరాల గ్రామానికి చెందిన బడేటి వంశీ(19) తుక్కుగూడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. కొంత కాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. కాగా, తల్లిదండ్రులు ఉదయం 8గంటలకు పనికి వెళ్లి తిరిగి 12గంటలకు వచ్చేవారు. శుక్రవారం ఉదయం పనికి వెళ్లిన తల్లిదండ్రులు మధ్యాహ్నం పన్నెండు గంటలకు వచ్చి చూసేసరికి తలుపు లోపలి నుంచి గడియ వేసి ఉంది. పిలిచినా లోపల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో తలుపులు బలవంతంగా తెరిచి చూసేసరికి వంశీ అప్పటికే చీరతో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, అతడు కొంత కాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, దాంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తండ్రి అంజయ్య తెలిపాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రేమ విఫలమై టీసీఎస్ ఉద్యోగి..

ఆదిభట్ల, ఫిబ్రవరి 23 : ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా వేములపల్లికి చెందిన సత్తి నాగచంద్రప్రకాశ్(24) ఆదిభట్లలో అద్దెకుంటూ టీసీఎస్‌లో మూడేళ్లుగా సిస్టం ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అతడి పక్క రూంలో ఉండే స్నేహితులు తలుపు తట్టగా నాగచంద్ర ఎంతకూ తీయలేదు. అతడికి ఫోన్ చేసినా లేపలేదు. దీంతో స్నేహితులు బాల్కనీ నుంచి లోనికి వెళ్లి చూడగా నాగచంద్రప్రకాశ్ బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. స్నేహితులు మన్నెగూడలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నాగచంద్రప్రకాశ్ కొంత కాలంగా ఓ యువతి (22)ని ప్రేమిస్తున్నట్టు సీఐ తెలిపారు. ఆమెతో మనస్పర్థలొచ్చి విడిపోవడంతోనే ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని అతడి తోటి ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేశారన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యుత్ సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలి





డీఈ, ఏడీ, ఏఈలతో మాట్లాడుతున్న సరూర్‌నగర్ డివిజన్ ఎస్ఈ కరుణాకర్ బాబు

ఇబ్రహీంపట్నం/యాచారం, ఫిబ్రవరి 23 : వేసవిలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ ఎస్ఈ కరుణాకర్‌బాబు ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ట్రాన్స్‌కో డీఈ, ఏడీ, ఏఈలతో విద్యుత్ సరఫరా తీరుపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య ఉన్నట్లు మీ దృష్టికి రాగానే తక్షణమే లోపాలను సరిచేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఏఈ, ఏడీఏ, డీఈలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అధికారులు, సిబ్బంది అలర్ట్‌గా ఉండాలన్నారు. లోటల్టేజీ రాకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలితే యుద్ధప్రాతిపదికన బాగుచేయించాలని, అక్రమ కనెక్షన్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇబ్బందులు ఎదురైతే 7901679895కు సమాచారం అందించాలని వినియోగదారులకు సూచించారు. సరూర్‌నగర్ డీఈ కె.రామకృష్ణ, ఏడీఈలు ప్రభాకర్, జి.సైదులు, ఏఈలు వేణుగోపాల్‌చారి, ఉదయ్, నవీన్‌అలీ, సందీప్ తదితరులున్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



కందుకూరు : పూజల్లో పాల్గొన్న భక్తులు

కందుకూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని పులిమామిడి గ్రామంలో చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 22న ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం ఉదయం చతుర్ధశి ఆశ్లేష నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి మహాసంప్రోక్షణ, పంచామృత అభిషేకం, సప్తనదీ జలాలతో వేద పండితులచే అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించి ట్రాక్టర్‌పై గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఉదయం 11గంటలకు మహాగణపతి, నవగ్రహ, లక్ష్మీసుదర్శన హోమాలు నిర్వహించారు. నేడు(శనివారం) ఉదయం 10:30గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఎం.భాస్కరశర్మ, రాజశేఖరశర్మ, గ్రామస్థులు తదితరులున్నారు.

సుందరంగా గ్రామ దేవతల అలయాలు

కొత్తూర్ : మున్సిపాలిటీలోని గ్రామ దేవతల ఆలయాలను సుందరంగా నిర్మిస్తామని మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.దేవేందర్ యాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని ఆయా కాలనీల్లోని 8 గ్రామ దేవతల ఆలయాలను దాతల సహకారంతో నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా పోచమ్మ అలయ పైకప్పు నిర్మాణం పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మాజీ ఎంపీపీ వేణుగోపాల్ గౌడ్, కౌన్సిలర్ మాదారం నర్సింహగౌడ్, నాయకులు జె. శ్రీను, గణేష్‌గౌడ్, దాసరి నర్సింహ, శ్రవణ్, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాలలో భద్రకాళి వీరభద్రస్వామి కల్యాణం

కడ్తాల్ : మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లి ఖార్జున స్వామి ఆలయంలో భద్రకాళి వీరభద్ర స్వామి కల్యాణం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. కడ్తాలతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు, పర్యవేక్షకులు రాజేశ్‌స్వామి ఆధ్వర్యంలో మేళతాళాలు, వేద్రమంతాల నడుమ స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం అగ్నిగుండ ప్రవేశం, నందికోల సేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ : వీరభద్రస్వామి కల్యాణం పాల్గొన్న భక్తులు



కొత్తూర్ : పోచమ్మ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దేవేందర్‌యాదవ్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 23: ప్రభుత్వ పథకాలను కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. గత బీఆర్ఎస్ పాలనలో గాడితప్పిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం దారిలోకి తీసుకువస్తూ పేదలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తుందని చెప్పారు. కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు కు ఆమనగల్లు లో కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో మంత్రిని సత్కరించారు. ఈసందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి , కాంగ్రెస్ నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. ప్రజలకు మెరుగైన పాలన , రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి అనేక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని గ్రహించిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ లు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ్మ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బీక్యానాయక్, జగన్, బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, మానయ్య, ఫరీద్, శ్రీకాంత్, హన్మనాయక్, నరేశ్, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్యనందిత మృతి బాధాకరం

● షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విచారం వ్యక్తం చేశారు. పిన్న వయస్సులోనే ప్రజల మన్ననలతో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆమె అర్ధాంతరంగా మృతి చెందడం ఆమె కుటుంబానికి తీరని లోటని తెలిపారు. ఆమె మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న కాంగ్రెస్



సబ్బురిగారి రాజు

షాబాద్, ఫిబ్రవరి 23 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తుందని, ఆదిశగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని సీనియర్ నాయకుడు సబ్బురిగారి రాజు అన్నారు. షాబాద్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్య బీమా, మహిళలకు బస్సు ప్రయాణం కల్పించిందని, తెల్ల రేషన్ కార్డుదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే కాలయాపన చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసి రైతుల మన్ననలు పొందుతుందన్నారు.

మృతుల కుటుంబాలకు జడ్పీటీసీ ఆర్థిక సాయం



సత్తయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 23 : రెండు వేర్వేరు ఘటనల్లో మృత్యువాత పడిన నిరుపేద రైతు కుటుంబా లకు షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి వారికి బాసటగా నిలిచారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన కందివనం సత్యం గత వారం అనారోగ్య పరిస్థితులతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పరామర్శించిన అవినాష్‌రెడ్డి రూ.20వేల సాయం చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని చర్లగూడ గ్రామానికి చెందిన కొత్తమాల సత్తయ్య గురువారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. సమాచారం తెలిసిన అవినాష్‌రెడ్డి సత్తయ్య కుటుంబ సభ్యులకు పరామర్శించి అతని భార్య లక్ష్మి కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశాడు. రెండు కుటుంబాలకు చెందిన బాధితులు రైతులు కావడంతో వ్యవసాయాధికారులతో చర్చించి రైతుబంధు అందేలా చూడాలని అన్నారు. అప్పారెడ్డిగూడ మాజీ సర్పంచ్ పూజితశ్రీనివాస్‌గౌడ్, చర్లగూడ మాజీ సర్పంచ్ పుష్పమ్మ, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, రాంచందర్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 : పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ప్రజా వైద్యశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లక్ష్మీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ జ్యోతిశ్మతిశర్మ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నిర్వాహకులు నయనాచారి, డాక్టర్ విశ్వేశ్వర్, డాక్టర్ లోకేశ్వర్, నాయకులు మీసాల వంశీ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కడ్తాల్, ఫిబ్రవరి 23:మండల పరిధిలో రావిచెడ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం ప్రారంభించారు. జాతీయ గ్రామీణగ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో సీసీ రోడ్ల నిర్మానానికి రూ. 15 లక్షలు మంజూరు అయ్యాయి. సీసీ రోడ్డు నిర్మాణం పనులను స్థానిక ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ లు ప్రారంభించారు. పనులు నాణ్యతగా, వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, జనార్ధన్‌గౌడ్, అంజయ్య రమేశ్, పారేశ, వెంకటయ్య, శంకరయ్య, మల్లయ్య, సంతోష్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో మెరుగైన వసతుల కల్పన

తలకొండపల్లి, ఫిబ్రవరి 23 : ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేయమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అర్లకుంట తండాలో ఈజీఎస్ నిధుల నుంచి రూ.5లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. తలకొండపల్లి మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2.60 కోట్లు మంజూరైనట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హేమ్‌లాల్, భాస్కర్, చంద్రు, బీమ్‌లాల్, శ్రీరామ్, రాజు, జగదీశ్, దశరథం, శ్రీను, హన్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రభాకర్ రెడ్డి

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రియాంక, ఎంపీటీసీలు, తదితరులు

నందిగామ, ఫిబ్రవరి 23: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రేవంత్‌రెడ్డి సారథ్యంలో గ్రామాలన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ ప్రియాంకశివశంకర్‌గౌడ్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలో నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.20లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను శుక్రవారం ఎంపీపీ స్థానిక ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేవల్లి కుమార్ గౌడ్ నాయకులు, అధికారులతో కలసి పనులు ప్రారంభించారు. ఎంపీడీవో సుమతి, పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్‌రెడ్డి నాయకులు జంగ నర్సింలు, శివకుమార్‌గౌడ్, నర్సింలు, జంగయ్య, బెంజుమెన్, సీఎం నరెందర్‌రెడ్డి, శివచారి, సుధాకర్‌రెడ్డి, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

మహేశ్వరం, ఫిబ్రవరి 23 : మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సహాయసహకారాలు అందిచాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్. సునీతఅంద్యానాయక్ అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాల విజయవంతంపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ఆలయ కమిటీకి అధికారులు, ప్రజాప్రతినిదులు సహకరించాలన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, సీఐ హెచ్. వెంకటేశ్వర్లు, ఎంపీవో రవిందర్‌రెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సునీతాఅంద్యానాయక్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, ఫిబ్రవరి 23: తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామానికి చెందిన కాడమోని ఐశ్వర్య అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలోకి చికిత్స పొందుతోంది. శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందతున్న ఆమెను కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు కాస శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలంలు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొనిమెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చికిత్స నిమిత్తం ఐశ్వర్యకు కాస శ్రీనివాస్ రెడ్డి రూ. 10 వేలు, మాజీ సర్పంచ్ రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సంక్షిప్తంగా..

● **మాడ్గుల** : మండలంలోని పల్గుతండాకు చెందిన రామావత్ సుగుణ(50)కు గురువారం బ్రెయిన్‌స్ట్రోక్ రావటంతో ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పీఏసీఎస్ డైరెక్టర్ రాజవర్ధన్ రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపి 50కిలోల బియ్యం సమకూర్చారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ తన ట్రస్టు ద్వారా రూ.3వేలు అందజేశారు.

● **మొయినాబాద్ రూరల్** : చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన మహ్మద్ ముఖీద్ న్యూ క్యాలిటిక్ సిస్టమ్స్ ఫర్ సమ్‌సెలెక్టివ్ సీ-సీ అండ్ సీ-హెటెరో ఆటమ్ బాండ్ ఫార్మేషన్ ఇన్ కెమికల్ సింథసిస్ అనే అంశంపై ప్రొఫెసర్ నర్సింహ పర్యవేక్షణలో పరిశోధన చేయగా యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మిని స్ట్రేటర్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డిలు ముఖీద్‌ను అభినందించారు.

● **కొందుర్గు** : మండల పరిధిలోని ముట్పూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి-సమీక్షల కుమారుడు హయన్ధృత్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా అందజేశారు. శుక్రవారం పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను, పెన్నులను, పెన్సిళ్లను అందజేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. తమ కుమారుడి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేసిన రాజేశ్వర్‌రెడ్డి- సమీక్షలను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో జంగారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు, కుర్మారావు, గ్రామస్థులు బుచ్చయ్య, సత్యంరెడ్డి, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

● **కడ్తాల్** : మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు సాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. సాలయ్య మృత దేహాన్ని శుక్రవారం మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నర్సింహ, రామచంద్రయ్య, పెంటయ్య, అశోక్, వెంకటేశ్, మహేశ్, తదితరులు ఉన్నారు.